మనుషులకు కాకపోతే కోర్కెలు మానులకుంటాయా? మనుషులకు కోర్కెలు కలగటం సహజం గదా! రామమూర్తికి, ఎందుకో ఆ రోజు - ఆ వింత కోర్కె కలగటం మాత్రం కాస్త వింతేననాలి!


అతను ప్రముఖ రచయితగా వ్రాసే నవల "ఇది మా కథ", ధారావాహికంగా, ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చేప్పుడు, అది ఎంత మంది చదువుతున్నారో తెలుసుకోవాలనేదే - ఆ కోరిక!

అంతే! లేడికి లేచిందే పరుగు అన్నట్లు ఆ కార్యక్రమం అంతు తేల్చుకోవాలని, రంగంలోకి దిగాడు.

తను రచయిత కాబట్టి తనను ఎరిగినవాళ్ళు తన

# ఇదీ నడుస్తున్న చరిత్ర

## ఎం.డి. సౌజన్య




నవలను గురించి అడిగితే - మొహమాటపడుతూ నిజం చెప్పరు!?

అందుకని, తానెవరో తెలియని గుంటూరు లాంటి పట్టణంలో, తన పాప్యులారిటీ ఏ పాటిదో తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే నిముషాల్లో గుంటూరు చేరాడు.

మొదట రామ్మూర్తి, దినపత్రికలు కొనకుండా చదివే అలవాటుండే జనం చేరే 'క్షుర కర్మశాలకు' వెళ్లాడు.

అక్కడ జనం అయిదారుగురు క్షుర సేవలు పొందుతుంటే, అయిదారుగురు వెయిటింగ్ లిస్టులో ఉన్నారు.

రామమ్మూర్తి, తనూ గడ్డం చేయించుకొనే నెపంతో, ఆ వెయిటింగు లిస్టులో చేరిపోయాడు

అక్కడ తన సీరియల్ ధారావాహికంగా వెలువడుతున్న 'తెలుగు ఢంకా' పత్రిక ఎవరి చేతిలో వుందో చూశాడు.

ఎవరో పాతిక ముప్పయి ఏళ్ల మధ్య వయసున్న గడ్డం యువకుడు ఆ పత్రిక చూస్తున్నాడు

అతని వాలకం చూస్తే నిరుద్యోగి ఏమో

'వాంటెడ్ కాలమ్' లాంటి శీర్షిక తదేకంగా చూస్తున్నాడు.

అతన్ని మెల్లిగా మాటల్లోకి దింపి తీరా విషయం కదిపితే "నేను దినఫలాలు - స్పోర్ట్స్ కాలమ్‌లు తప్ప, మరొకటి చదవను! అయినా కాలక్షేపం కోసం వ్రాసే నవలల సీరియల్స్ చదివి టైం వేస్ట్ చేయటం ఇష్టంలేదు!" అన్నాడు నిర్మొహమాటంగా.

"అయితే నిరుద్యోగ సమస్య చిత్రించే నవలను నిరుద్యోగి కూడా చదవటం లేదన్నమాట-' అనుకున్నాడు, రామమూర్తి.

వెయిటింగ్ లిస్టులో ఉన్న వాళ్ళల్లో, ఆ మధ్య యాభై అయిదేళ్ళకే అర్థాంతరంగా రిటైర్ అయి కోర్టుకెక్కిన ఉద్యోగి, ప్రక్కనే ఉన్నాడు.

ఆయనను "ఇది మా కథ" నవల గురించి కదిపాడు, రామమూర్తి.

ఆయన చిద్విలాసంగా, సర్వసంగ పరిత్యాగిలా ఒక చిరునవ్వు నవ్వి ... మీరు చెప్పే ఆ నవల - అర్థాంతరంగా, తెల్లారేప్పటికి ఉద్యోగాలు పోయిన మా బాధామయ గాథ కంటే గొప్పగా వుంటుందా!? యువకుడిగా నేను ప్రేమగీతాలు, ఆ ప్రేమ ఫలించక, విషాద గీతాలు, విరహ గీతాలు - ఒకప్పుడు వ్రాశాను! ఇప్పుడు నేను పేపర్లో చూసేది ... నాలా ఉద్యోగాలు పోయిన వాళ్లను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకోబోతోంది - అన్నదే!" అన్నాడు.

ఇక అక్కడ లాభం లేదని, అన్ని కాలేజీలకు సెంటర్‌లో ఉన్న వెంకటేశ్వర రీడింగ్ రూమ్‌కు బయలుదేరాడు, రామమూర్తి.

అక్కడైతే "ఇది మా కథ" నవల చదివే విద్యార్థులైనా, తమ తమ అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెలువరిస్తారని, అతని ఆశ!

రామమూర్తి అక్కడికి వెళ్లేటప్పటికి దాదాపు రీడింగ్ రూమ్ నిండా అన్ని వయసులవాళ్లూ కిటకిటలాడి పోతున్నారు.


ఎవరో స్టూడెంట్ 'తెలుగు ఢంకా' పత్రిక శ్రద్ధగా చదవటమే కాదు, నోట్సులో ఏదో వ్రాసుకుంటున్నాడు.

"బహుశా అతను నా నవల "ఇది మా కథ" - అనేది చదివే ... ఏదో ఇంపార్టెంట్ మేటర్ నోట్ చేసుకుంటున్నాడు!" అనుకున్నాడు, రామమూర్తి.

ఆ సంతోషంతో రామమూర్తి, 'తెలుగు ఢంకా' - పత్రిక చేతిలో వున్న విద్యార్థి ప్రక్కన ఎలాగో ఇరుక్కుని, "ఇది మా కథ" సీరియల్ చదివి ఇస్తాను!" అన్నాడు, పత్రికవేపు ఆశగా చూస్తూ.

అంతవరకు ఆ పత్రిక చూస్తున్న విద్యార్థి "మా అభిమాన హీరో సినిమా ఎన్ని కేంద్రాల్లో శతదినోత్సవాలు చేసుకుందో 'నోట్' చేసుకుంటున్నాను!! జస్ట్ వొన్ మినిట్!" అంటూ తెలుగు ఢంకా ఇచ్చివేశాడు.

అతను ఆ పని మీదే అక్కడి రీడింగ్ రూముకు వచ్చినట్టు అక్కడి నుంచి వెళ్ళిపోతుంటే, అతని వెంట నడచి ఆ విద్యార్థిని మాటల్లోకి దింపి "ఇది మా కథ" - సీరియల్" నవల బాగుందని అంటున్నారు! ఈ రీడింగ్ రూమ్‌లో పాత కాపీలు ఇవ్వమంటే ఇస్తారా




## ఇదీ నడుస్తున్న చరిత్ర

ఇక్కడే చదవటానికి?" అన్నాడు, రామమూర్తి, అలాగన్నా, ఆ విద్యార్థిని సంభాషణల్లోకి దింపాలని.

రామమూర్తి వేపు ఆశ్చర్యంగా చూసిన ఆ విద్యార్థి "సోషల్ నవలలు ఎవరు చదువుతారండి ఈ రోజుల్లో! కాస్త - క్రైమ్, సెక్స్, మర్డర్ హర్రర్ ఉండాలి గాని!" అన్నాడు.

సోషల్ నవలలు ప్రచురించే పత్రికల పాత కాపీల విషయం అతనికి పట్టినట్టే లేదు.

"ఇదేమిటి! విద్యార్థులు - నేటి విద్యా విధానం వాటిలో లోపాలు - గైడ్లు - వాటి వల్ల విద్యా స్థాయి ఎలా దిగజారిపోయిందో ఎంతో కష్టపడి వ్రాశానే! అయితే అవి ఎవరూ చదవటం లేదన్నమాట ...!! విద్యార్థి సమస్యలు కూలంకషంగా చర్చించిన విషయాలు -విద్యార్థులే తెలుసుకునే పరిస్థితిలో లేరన్న మాట ... వాట్ ఎ ఫాల్ మై కంట్రీ మేన్!" అనుకున్నాడు, రామమూర్తి, బాధగా.

ఇక అక్కడ వుండబట్టక రామమూర్తి సిటీ బస్సెక్కి లక్ష్మీపురం బయలుదేరాడు.

బస్సులో ఎవరి దగ్గరా 'తెలుగు ఢంకా' లాంటి పత్రికేలేదు.

వందమందున్న బస్సులో వొక్కరి దగ్గరా -'తెలుగు ఢంకా' లాంటి - అత్యధిక పాఠకుల చేత (కొని) చదవబడుతున్న పత్రిక - లేకపోవటం ... ఎంత బాధాకరమైన విషయం!

పోనీ 'తెలుగు ఢంకా' కాకపోతే మరొక పత్రిక వుందా అంటే అదీలేదు.

నిరాశగా లక్ష్మీపురంలో దిగిన రామమూర్తికి ఎదురుగా 'ఒక 'అద్దె లైబ్రరీ' పుస్తకాల షాపు కనిపించింది.

అక్కడ అన్ని రకాల పుస్తకాలతో పాటు డైలీ పేపర్లూ, వీక్లీలు, మంత్లీలూ అద్దెకివ్వబడునని బోర్డు ఆశ్చర్యంగా చూశాడు.

"డైలీ పేపర్లూ అద్దెకిస్తారా?" అన్నాడు ఆశ్చర్యంగా, రామమూర్తి.

"పేపరు కొని ఇంటికి తీసికెళ్లి చదివి గంటలో తెచ్చిస్తే, అద్దె ఒక పావలా అవుతుంది! ఇక్కడే చదివి ఇచ్చేటట్లయితే ... పావలాకి రెండు పేపర్లు, గంటలో చదవటానికి ఇస్తాను!" అన్నాడు, ఆ షాపువాడు.

రామమూర్తి తెలుగు ఢంకా పత్రిక కొంటూ

"ఇందులో ఏదో సీరియల్ బాగుందంటున్నారు మీరు చదివారా?" అన్నాడు, రామమూర్తి.

"మాయలు, మంత్రాలు, హత్యలు, మాన భంగాలు, క్రైమ్, డిటెక్షన్ లేకుండా వ్రాస్తే ఎవరు చదువుతారు సార్ సీరియల్!" అన్నాడు షాపతను.

"అయితే సామాజిక స్పృహ ...!" అన్నాడు రామమూర్తి.

"రాసేవాళ్ళు వంటి మీద స్పృహ వుండి వ్రాస్తే ఇక చదివేవాళ్ళని గురించి అడగొచ్చు! రైటర్సులో ఉన్నంత హిపోక్రసీ ప్రపంచంలో మరెవరి దగ్గరైనా వుందా!! వాళ్లందుకోలేనివి, వాళ్లకే సరిగా అవగాహన కానివి, వాళ్లకే తలా తోకా తెలియని వ్రాసే వాళ్ళు ఎక్కువయ్యారు!! కాలక్షేపం కోసమో పేరు కోసమో వ్రాసే వాళ్ళు ఎక్కువయ్యారు!! అలాగే .. ఏమీ తోచక చదివేవాళ్ళు!! సాహిత్య విలువలు ఎవరికి కావాలి?సంఘం బాగుపడాలని ఎవరు కోరుకుంటారు!!పాఠకుల బలహీనతలను ఆధారం చేసుకుని రచనలు సాగించినన్నాళ్ళు, ఆ రచనలు ఆధారంగా పత్రికల సర్క్యులేషన్లు కాపాడుకోవాలనుకున్నన్నాళ్ళు ఈ సమస్యకు పరిష్కారం లభించదు!" అన్నాడు షాపువాడు.

రామమూర్తికి ఆ షాపు యజమాని ధోరణి వింతగా అనిపించి "మీరు చెప్పేదాన్ని బట్టి చూస్తే, మీకు రచనల విషయం - పత్రికల విషయం, పాఠకుల విషయం, బాగా తెలిసిన వారల్లే వుంది ...!!మీ పేరు?" అన్నాడు, రామమూర్తి.

ఆ వ్యక్తి సమాధానంగా నవ్వి, "పూర్వాశ్రమంలో నా కలం పేరు 'కమలాప్రియ'!! ఒకప్పుడు నేనే ఒక సాహితీ మాసపత్రిక నడిపాను! సాహితీ రంగంలో ఏమాత్రం పరిచయం వున్నవారైనా 'కమలిని' అనే పత్రికపేరు వినే వుంటారు.

నా అసలు పేరు రాంప్రసాద్!! వెయ్యి కథలు వంద నవలల షైచిలుకు వ్రాశాను. ఈ సాహితీ పిచ్చిలో పడి ఇల్లూ, పొలం పోగొట్టుకున్నాను. ఇక జ్ఞానోదయం అయ్యాక జీవికకు ఈ అద్దె పుస్తకాల షాపు ఆధారమయ్యింది!" అన్నాడు, బాధగా.

పూర్వం సాహితీరంగంలో 'కమలాప్రియ' పేరు తెలియని వారు లేరు. అంత గొప్పగా, అన్ని రచనలు చేసిన రచయితనే విస్మరించింది ప్రస్తుత సమాజం!! మరి ... నాలుగు నవలలు వ్రాసిన తనను గురించి ...?? రామమూర్తికి భయంవేసింది. □